క్లుప్తంగా

రుణమాఫీలో కాంగ్రెస్ విఫలం

వీణవంక: రుణమాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వానాకాలం సీజన్ పూర్తి కావస్తున్నా, రైతు భరోసా ఇవ్వడంలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి బూత్‌ల వారీగా సభ్యత్వాలు ప్రారంభించారు. మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రఘు, జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, నర్సింహరాజు, సంజీవరెడ్డి, సమ్మిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్, కోమల్‌రెడ్డి, శ్రీనివాస్, గణేశ్, రాజు, రాజయ్య, హరిశంకర్ పాల్గొన్నారు.

'మన్ కీ బాత్' వీక్షించిన బీజేపీ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని బూత్ నంబర్ 177లో ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ ప్రసంగాన్ని బీజేపీ నాయకులు ఆదివారం వీక్షించారు. దేశం పురోగతి వైపు నడుస్తుందని పీఎం మోదీ పలు విషయాలను మాట్లాడారని తెలిపారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, అప్పం మధు, కొండె నగేష్, ముకుంద సుధాకర్, అప్పల రవీందర్, ఐత ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రతిభ

చొప్పదండి: మండలంలోని చాకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ టీచర్, అసిస్టెంట్ లీడర్ ట్రైనర్ కంకణాల రాంరెడ్డి స్కౌటింగ్ స్కిల్స్‌లో ప్రతిభ కనబరిచి ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో నిర్వహించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రీ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నారు. వాల్యూ బేస్డ్ స్కౌటింగ్ అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. హైక్, పాట్రోల్ మీటింగ్స్, క్యాంప్స్, బేసిక్, అడ్వాన్స్‌డ్ స్కౌట్ మాస్టర్స్‌కు శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు డిప్యూటీ డైరెక్టర్, స్కౌట్ లీడర్ ట్రైనర్ స్మృతి సౌరభ్‌రాయ్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కలిప్రసాద్ మిశ్రాలు కంకణాల రాంరెడ్డిని అభినందించారు. ప్రతిభ కనబరిచిన రాంరెడ్డిని రాష్ట్ర, మండల అధికారులు అభినందించారు.

బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

మానకొండూర్: కరీంనగర్ జిల్లా అండర్ 19 బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక ఆదివారం మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో జరిగింది. సెలక్షన్లలో బాలల నుంచి 15, బాలికల నుంచి 20 మందిని ఎంపిక చేశామని బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జాయింట్ సెక్రటరీ ఏ.రాములు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వినోద్‌కుమార్, పీఈటీ వి.శివప్రసాద్, అలేఖ్య, భవానీ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో బొంతుపల్లి వాసులు

వీణవంక: మండలంలోని బొంతుపల్లి వాసులు తిరుమల తిరుపతి వేంటేశ్వరస్వామి సేవలో తొమ్మిది రోజులు పాటు పాల్గొననున్నారు. 25 మంది ఈ నెల 21న తిరుపతికి వెళ్లి 23 నుంచి అక్టోబర్ 1 వరకు శ్రీవారి సేవలో పాల్గొంటున్నారు. గోవింద నామాలు జపిస్తూ, తిరుమలకు వచ్చిన భక్తులకు వివిధ రకాల సేవలు చేస్తున్నారు. శ్రీవారి కృపతో టెంపుల్ డ్యూటీ లభించిందని టీం లీడర్ సంపత్ తెలిపారు. కరీంనగర్ నుంచి తిరుపతికి ప్రతిరోజు రైలు సౌకర్యం కల్పించాలని, అందుకు కేంద్రహోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కృషి చేయాలని కోరారు.

డైరెక్టర్‌కు సన్మానం



నర్సయ్య సన్మానిస్తున్న సంఘం సభ్యులు

గన్నేరువరం: పద్మశాలీ సంఘం సభ్యుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వొడ్నాల నర్సయ్యను సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గన్నేరువరంలో సన్మానించారు. డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య, ప్రధాన కార్యదర్శి బూర శ్రీనివాస్, సహాయ కార్యదర్శి బొల్లి రవీందర్, ఉపాధ్యక్షుడు తెల్ల అంజయ్య, ప్రచార కార్యదర్శి గాజుల లక్ష్మణ్, కార్యవర్గ సభ్యుడు సదానందం, తిరుపతి, శ్రీనివాస్, రాజమల్లు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: గర్భిణులు సమయానుగుణంగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సుగుణ అన్నారు. మండలంలోని కందుగుల గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో సుగుణ మాట్లాడుతూ.. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజశ్రీ మాట్లాడుతూ.. గర్భిణులు తీసుకునే పోషకాహారం ద్వారా పిల్లకు సరైన పోషకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ రజిత, పద్మ, స్వరూప, గర్భిణులు న్నారు.

ఆలయం కూల్చారు.. నిర్మాణం మరిచారు

- వచ్చిన నిధులు వాపస్
- మరోసారి నిధుల కోసం ప్రయత్నం



కూల్చకముందు దేవాలయం



కూల్చిన తరువాత..

గంగాధర: పండుగల పూట భక్తులతో కిటకిటలాడే దేవాలయం శిథిలమయింది. నిత్యం పూజలందుకునే వేంకటేశ్వరస్వామి ఆలయం తలుపులు తెరచుకోక గర్భగుడిలోనే బంధీ అయిపోయాడు. మండల కేంద్రంలో శతాబ్దాల చరిత్ర కలిగిన వేంకటేశ్వర దేవాలయం శిథిలమైంది. ఆలయం పునః నిర్మాణానికి పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో దేవాలయ నిర్మాణానికి మంజూరయిన దాదాపు రూ.16లక్షలు దేవాదాయ శాఖకు తిరిగి వెళ్లాయి. మండల కేంద్రంలోని వేంకటేశ్వర దేవాలయ నిర్మాణం కాకతీయుల కాలంలో రుద్రమదేవి పాలనలో మంత్రిగా ఉన్న గంగాధరుడు నిర్మించాడని చరిత్ర చెబుతోంది. ఎంతో చరిత్ర కలిగిన ఈ దేవాలయం శిథిలావస్థకు చేరడంతో పునః నిర్మాణానికి భక్తులు దాదాపు రూ.4లక్షల విరాళాలు సేకరించి దేవాదాయ శాఖకు చెల్లించారు. దాదాపు 9 సంవత్సరాల క్రితం రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆలయ నిర్మాణానికి 8 సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. పనులు చేపట్టడానికి పాత కట్టడాలు కూల్చివేశారు. ప్రస్తుతం గర్భగుడి మాత్రం మిగిలి ఉంది. పాత దేవాలయం కూల్చి ఏడెనిమిది సంవత్సరాలు కావస్తున్నా.. భూమిపూజ నిర్వహించి సంవత్సరాలు గడిచినా.. పనులు మాత్రం ప్రారంభించలేదు. పురాతన దేవాలయానికి సంబంధించిన రాతి స్తంభాలు తొలిగించి ఎక్కడివక్కడ పడేశారు. పనులు ప్రారంభించి గర్భగుడి కోసం కొంతమేర గోడలు లేపి వదిలేశారు. దేవాలయ చుట్టుపక్కల ప్రాంతం మొత్తం చెత్తాచెదారం నిండిపోవడంతో.. పాములు, విష పురుగులకు నిలయంగా మారింది. పాములు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు వాపస్

వేంకటేశ్వరస్వామి దేవాలయ పునః నిర్మాణానికి మంజూరయిన నిధులు పనులు చేయకపోవడంతో దేవాదాయ శాఖ వాపస్ తీసుకుంది. దేవాలయ నిర్మాణానికి ఆలయ అభివద్ధి కమిటీ వేసి అధ్యక్షున్ని ఎన్నుకున్నారు. దాదాపు రూ.4లక్షల విరాళాలు సేకరించి దేవాదాయ శాఖకు చెల్లించడంతో.. అదనంగా రూ.16లక్షలు మంజూరు చేసింది. అప్పటి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పెరుక మల్లారెడ్డి మృతిచెందడంతోపాటు పనులు చేపట్టకపోవడంతో దేవాదాయ శాఖ నిధులు వాపస్ తీసుకుంది.

రూ.40లక్షలతో..



వేంకటేశ్వరస్వామి దేవాలయం రూ.40లక్షల వ్యయంతో పునః నిర్మాణానికి దేవాదాయ శాఖ వారిని కలిశాం. ఖర్చులో నాలుగో వంతు చెల్లిస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ వేసి చైర్మన్‌గా దేశెట్టి నర్సయ్యను ఎన్నుకున్నాం. రూ.10లక్షల కార్పస్‌ఫండ్ కోసం ప్రయత్నిస్తున్నాం.

– మడ్లపల్లి గంగాధర్, మాజీ సర్పంచ్



శంకరపట్నం: కేశవపట్నం మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో పందులు సంచరిస్తున్నాయి. పందుల కోసం గేట్ బయట వల వేశారు. హాస్టల్‌లో పందులు సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈ సమస్యపై స్పందించాల్సిన అధికారి
లక్ష్మీనారాయణ, ఎంఈవో శంకరపట్నం, సెల్ నం : 9912127700

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రవీందర్‌రెడ్డి

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి, జంగపల్లి, మాదాపూర్ మీదుగా గన్నేరువరంకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి కరీంనగర్‌లో వినతిపత్రం అందజేశారు. మంత్రి, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం బస్సు త్వరలో ప్రారంభమవుతోందని తెలిపారు.



స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో గంద్రపల్లి పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు

స్వచ్ఛతాహీ సేవ



చొక్కారావుపల్లెలో శ్రమదానం

జమ్మికుంట: మండలంలోని గంద్రపల్లి గ్రామం తెలంగాణ సాంఘిక బాలికల గురుకుల పాఠశాల, శాయంపేట, నాగంపేట, తనుగుల, విలాసాగర్, కోరపల్లి, మడిపల్లి, సైదాబాద్ గ్రామంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ఈసందర్భంగా స్కూల్‌ఆవరణ శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, జీపీకార్యదర్శులు పోరెడ్డి నరేందర్ రెడ్డి, వెంగల రాము, బండ ప్రసాద ముగల అంజిరెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నేరువరం: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా చొక్కారావుపల్లె ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ప్రతివారం కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, అంగన్‌వాడీ టీచర్ శారద, వీవోఏ స్రవంతి, కారోబార్ అజయ్, ఈజీఎస్ మేట్ తరుణ్, మల్లారెడ్డి, బాపురెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

మానకొండూర్: మండలంలోని చెంజర్ల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని ఏఈ ఎం.రమేశ్ ప్రకటనలో తెలిపారు. నేషనల్ హైవే విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ సరాఫరాలో ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన కమిటీ



శంకరపట్నం: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం శంకరపట్నం మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నామని జిల్లా అధ్యక్షుడు మహేందర్ తెలిపారు. మండలంలోని మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేడి మహేశ్, దేవునూరి కిష్టయ్య సమక్షంలో కమిటీ అధ్యక్షుడిగా ఎల్కపల్లి సుధీర్, గౌరవ అధ్యక్షులు అభిలాష్, మధుకర్, ప్రధాన కార్యదర్శిగా రంజిత్, ఉపాధ్యక్షుడిగా నవీన్, సహాయకార్యదర్శిగా మల్లేశ్, కోశాధికారిగా మహేశ్, సభ్యులుగా అనిల్, కళ్యాణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వివరించారు.

చిగురుమామిడి లయన్స్ క్లబ్..



చిగురుమామిడి: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో చిగురుమామిడి క్లబ్‌ను ఏర్పాటు చేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు, ఫస్ట్ వైస్ గవర్నర్ సింహరాజు కోదండరాం, సెంకడ్ వైస్ గవర్నర్ మోర భద్రేశం, కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఆకవరం మఠం శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, భేతి రాజిరెడ్డి, సెక్రటరీగా కానిపర్తి సత్యం, కోశాధికారి బొల్లి ఐలయ్య, ఎల్‌సీఐఎఫ్ చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, సర్వీసు కో ఆర్డినేటర్ ఏలేటి రవీందర్‌రెడ్డి, మెంబర్‌షిప్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ తాటిపెల్లి ఈశ్వరయ్య, మార్కెటింగ్ చైర్మన్ జి. చంద్రశేఖర్, పొన్నం శ్రీనివాస్, చిటుమల్ల రవీందర్ మరో పదిమంది డైరెక్టర్లను నియమించారు.

యూత్‌క్లబ్ కార్యవర్గం

చొప్పదండి: పట్టణంలోని యంగ్ బాయ్స్ యూత్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎలిగేటి సంజీవ్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఎండీ ఖాజాఅలీ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ జహీరొద్దీన్, కోశాధికారిగా సింహాచలం విశ్వమోహన్, ప్రచార కార్యదర్శిగా ఎండీ షాబీర్‌ను ఎన్నుకున్నారు.

మున్నూరుకాపు గన్నేరువరం కమిటీ

గన్నేరువరం: గన్నేరువరం మున్నూరుకాపు గ్రామ కమిటీని ఆదివారం మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం నాయకుడు, మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్ ఆధ్వర్యంలో సమావేశమై ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా దొగ్గలి శ్రీను, ఉపాధ్యక్షులుగా గొల్లపల్లి రవి, పుల్లెల రాము, కోశాధికారిగా చిగురు అంజయ్య, కార్యదర్శిగా మల్లయ్య, సహాయ కార్యదర్శులుగా మంగరాజు లక్ష్మణ్, కొనగాల అంజయ్య, కార్యవర్గసభ్యులుగా కొలుపుల తిరుపతి, దాసరి అంజయ్య, పుల్లెల సంపతి, బొమ్మ కిషన్, ముంజం శ్రీను, పెరక నర్సయ్య నియామకమయ్యారు. కార్యక్రమంలో నాయకులు కటకం తిరుపతి, బొడ్డు సత్తయ్య, భూపతి, కొట్టె భూమయ్య, రవి, కొలుపుల మహేందర్, వేణు, రవి, పుల్లెల రాము, మల్లయ్య, జగన్, దొగ్గలి ప్రదీప్, కయ్యం శ్రీకాంత్, గొల్లపల్లి అంజయ్య, పాల్గొన్నారు.



బాలయ్యను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు సునీల్

అత్యాశ.. నీట ముంచింది

- మానేరులో నీటమునిగిన ఇసుక ట్రాక్టర్లు
- త్రుటిలో తప్పిన ప్రమాదం





మానకొండూర్: ఇసుక అక్రమ రవాణాదారులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. అత్యాశతో ఇసుకు అక్రమ రవాణాకు పాల్పడుతుండగా ప్రాణాలతో బయటపడ్డారు. ఎల్ఎండీ గేట్లు ఎత్తడంతో మానేరులో నీటి ప్రవాహం పెరిగింది. ఇసుక ట్రాక్టర్లను వాగులోనే వదిలేసి వెంటనే వాగు ఒడ్డుకు చేరుకుని ఊపిరిపీల్చుకున్నారు. ఈసంఘన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. వానొచ్చిన వరదలొచ్చిన మానేరువాగు నుంచి ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. రేయింబవళ్లు ఇసుక దందా జోరుగా సాగుతోంది. అత్యాశతో మండలంలోని వివిధ గ్రామాల వారు మూడు ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణాదారులు శ్రీనివాస్‌నగర్ గ్రామ శివారులోని మానేరు వాగులోకి శనివారం సాయంత్రం వెళ్లారు. మొదటి రోజు శుక్రవారం లాగే నీటి ప్రవాహం తక్కువగా ఉంటుందనుకుని మానేరు వాగులోకి ఇసుక ట్రాక్టర్లతో శనివారం సాయంత్రం వెళ్లి ఇసుక లోడ్ చేస్తుండగా లోయర్ మానేరు డ్యాం గేట్లు ఎత్తిన కారణంగా మానేరులో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఇసుకను నింపుతున్నవారు నీటి ప్రవాహం పెరగడాని గమనించారు. ఆందోళనకు గురై వారు ఇసుక ట్రాక్టర్లను బయటకు తీసుకురాలేమని గుర్తించి అక్కడే ఉంటే మానేరువాగులో కొట్టుకు పోయి ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని వెంటనే అక్కడి నుంచి పరుగు పరుగున ఒడ్డుకు చేరుకున్నారు. నీటి ప్రవాహనం కారణంగా ఓ ట్రాక్టర్ వాగులోనే బోల్తా పడగా, మరో రెండు ట్రాక్టర్లు మునిగిపోయాయి. ఆదివారం నీటి ప్రవాహం తగ్గడంతో ఇసుక ట్రాక్టర్లను క్రేన్ సహాయంతో తీసేందుకు ప్రయత్నించారు. ట్రాక్టరును మానేరు ఒడ్డుకు తీయగా మరో రెండు ట్రాక్టర్లు మానేరు వాగులోనే ఉండి పోయాయి. ఓ వైపు మానేరు గేట్లు ఎత్తేస్తున్నామని అధికారులు కోడై కూసిన ఇసుక అక్రమార్కులకు అవేమి పట్టకుండా అక్రమార్జనే లక్ష్యమని మానేరులోకి వెళ్లడం పరిపాటిగా మారిందని, ఇసుక ట్రాక్టర్లు బయటకు తీశాక కేసు పెట్టడమా లేక వదిలేయడమా అనే ఆలోచనలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆర్థికసాయం

గంగాధర: మండలంలోని హిమ్మత్‌నగర్‌కు చెందిన తడిగొప్పుల గణేశ్ అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ దీనస్థితిని స్థానిక బీజేపీ నాయకులు కేంద్రహోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి రూ.పదివేలు సాయం చేయగా నాయకులు ఆదివారం గణేశ్ కుటుంబ సభ్యులకు అందించారు. దూళం కళ్యాణ్, గుండారపు సంపత్ బియ్యం అందజేశారు. సర్వ శ్రీనివాస్, శంకరయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంకు చెందిన న్యాత రాజ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం కుటుంబ సభ్యులను రాజ్‌కుమార్ చిన్ననాటి స్నేహితులు పరామర్శించారు. ఈ సందర్భంగా యాభై కిలోల బియ్యం, రూ.ఐదువేల నగదు అందజేశారు. స్నేహితుడి అకాల మరణం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఐలయ్య, అంజయ్య తిరుపతి, రమేశ్, లక్ష్మణ్, శేఖర్, ప్రభాకర్, ఐలయ్య, రాజ్‌కుమార్, రాము, సునంద్, మురళి, మనోహర్ పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల పాఠశాల వార్షికోత్సవం

హాజరుకానున్న మంత్రులు



మాట్లాడుతున్న చాద వెంకట్ రెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశాల, వృత్తి విద్య శిక్షణ కేంద్రం వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాద వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మహిళా శిశు సంక్షేమ, మానసిక వికలాంగుల సీనియర్ సిటిజన్స్ శాఖ ప్రభుత్వ కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ శైలజ, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవుతారని వివరించారు. పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడారు. 1989లో ప్రారంభించిన పాఠశాల 34 ఏళ్లుగా పూర్తి చేసుకొని 35వ సంవత్సరంలోకి అడుగు పెడుతుందన్నారు. వార్షికోత్సవ సభకు విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, పాఠశాల అభివృద్ధిని ఆకాంక్షించే దాతలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ట్రస్టు సభ్యులు సముద్రాల జనార్దన్, గాజుల భగవాన్, జాప వెంకటరమణారెడ్డి తదితరలు పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

రామడుగు: మండలంలోని గుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1981-82 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలను తెలుసుకున్నారు. చదువుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లికి చెందిన గడ్డం కుమారస్వామి(25), చిమ్మని అనుదీప్(23) స్నేహితుని కారులో ఆదివారం మొలంగూర్ వైపు వెళ్తుండగా గ్రామ శివారులోని రోడ్డు పక్కన బండను ఢీకొని పల్టీలు కొడుతూ పొలంలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ప్రమాద స్థలాన్ని బ్లూకోల్ట్స్ పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

హన్మాజిపల్లెలో చోరీ

గన్నేరువరం: మండలంలోని హన్మాజిపల్లె గ్రామంలో సంపతి మమత ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల తెలిపిన వివరాలు... మమత భర్త పర్శరాములు ఆగస్టులో మృతి చెందడంతో ఇంటిని వదిలిపెట్టి గ్రామంలోని తల్లిగారి ఇంట్లో ఉంటోంది. శనివారం ఇంట్లోకి వెళ్లి బీరువాను పరిశీలించింది. రూ.యాభైవేలకు పైగా నగదు బంగారు, వెండి ఆభరణాలను దొంగలు దోచుకెళ్లారని మమత ఫిర్యాదుకు మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు.

లారీ డ్రైవర్లు, ఓనర్ల రిమాండ్

జమ్మికుంట: మండలంలోని శంభునిపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక అధిక లోడ్‌తో తరలిస్తున్న నలుగురు డ్రైవర్లు, ముగ్గురు ఓనర్లును పారిపోగా పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వరగంటి రవి ఆదివారం రాత్రి తెలిపారు. ఈ నెల 26 వ తేదీన శంభునిపల్లి గ్రామ శివారులో అధిక లోడుతో ఇసుక తరలిస్తుండగా ఎస్ఐ ఆరోగ్యం పట్టుకున్న సమయంలో లారీ డైవర్లు రామంచ కిషన్, కందుకూరి సాయికృష్ణ, గంగారపు రాజేందర్, మంతూరి కుమారస్వామి, ఓనర్లు నిమ్మల రాజగోపాల్, నైనరీ రమేష్, చింతల మహేందర్ పారిపోయారు. దీంతో ఆదివారం రాత్రి శంభునిపల్లి గ్రామ శివారులోని పోచమ్మగుడి వద్ద అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

వీణవంక: మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థులపట్ల బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తోందని ఓ విద్యార్థి తండ్రి ఆదివారం ఆరోపించాడు. గంగారం గ్రామానికి చెందిన నాల్గో తరగతి విద్యార్థి, మరో విద్యార్థి స్కూల్‌లో గొడవపడ్డారు. సాయంత్రం ఇంటికి తీసుకెళ్లడానికి వచ్చిన తండ్రికి బాలుడు చేతికైన గాయాన్ని చూపించాడు. స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తించారని ఆ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారిని కోరాడు.

బుర్ర మల్లేశంకు సన్మానం



మల్లేశంను సన్మానిస్తున్న జగదీశ్

గన్నేరువరం: కబడ్డీ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా నియామకమైన బుర్ర మల్లేశంగౌడ్‌ను ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన జనరల్ బాడీ, ఈసీ సమావేశంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ జగదీశ్ శాలువాతో సన్మానించారు. అంచెలంచెలుగా ఎదుగుతున్న మల్లేశ్ మరింత ముందుకుసాగాలని ఆకాంక్షించారు.